కాంట్రాక్ట్ కార్మికులను
వేధించడం తగదు
● ఆలిండియా పవర్‌మెన్ ఫెడరేషన్
● 13 నుంచి కోల్‌కతాలో అఖిల భారత సదస్సు 9

పరప్పన జైలులో ఖైదీలతో
దర్శన్ వివాదం
● బ్యారెక్ వద్ద ఉద్రిక్తత
● ప్రత్యేక నిఘా ఉంచిన అధికారులు 7







ఉత్తరం..!

● పేరుకే సమావేశాలు ● అభివృద్ధికి నోచుకోని కల్యాణ కర్ణాటక
● ప్రతి జిల్లాది దీన చరిత్రే ● నేతల చిన్నచూపు..
● ఈ సారైనా చర్చ జరిగేనా..? ● కల్యాణ కర్ణాటక వాసుల ఎదురుచూపు

రాష్ట్రాన్ని రెండుగా విభజిస్తే దక్షిణ కర్ణాటక, ఉత్తర కర్ణాటకలుగా చెప్పవచ్చు. దక్షిణ కర్ణాటకలో రాజధాని బెంగళూరుతోపాటు కావేరి నదికి అనుబంధంగా ఉండే జిల్లాలతోపాటు తీరప్రాంత జిల్లాల్లో దశాబ్దాల కాలంగా ప్రగతి పరుగులు తీస్తోంది. ఉత్తర కర్ణాటక ప్రదేశాన్ని కిత్తూరు కర్ణాటక, కల్యాణ కర్ణాటకగా పిలుస్తారు. ఈ ప్రాంతంలో కృష్ణా నది ప్రవాహానికి అనుబంధంగా ఆల్మట్టి, నారాయణపుర వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. బళ్ళారి అనుబంధమైన విజయనగర జిల్లాలో తుంగభద్ర జలాశయం కీలకమైనది. అయినా ఉత్తర కర్ణాటకలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. దీంతో ఉత్తరం వైపు ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనే విమర్శలు తరచూ వినిపిస్తుంటాయి. (ఆంధ్రజ్యోతి, బెంగళూరు)

కిత్తూరు కర్ణాటకలో..

రాష్ట్రంలోనే అత్యంత పెద్ద జిల్లాగా బెళగావి ఉంది. గోకాక్, చిక్కోడి కేంద్రాలకు అనుబంధంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని రెండు దశాబ్దాలుగా పోరాటం సాగుతోంది. కల్యాణ కర్ణాటక తరహాలో కిత్తూరుకు అభివృద్ధి మండలి ఏర్పాటుకు డిమాండ్ ఉంది. గత ప్రభుత్వం 14 ఎత్తిపోతల ప్రాజెక్టులకు రూ.5వేల కోట్లు కేటాయించగా ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం లేదు. గోకాక్ జలపాతాన్ని జోగ్ తరహాలో అంతర్జాతీయ పర్యాటకకేంద్రంగా తీర్చాలని మూడు దశాబ్దాలుగా డిమాండ్ ఉంది. బెళగావి, విజయపుర, బాగల్కోటె జిల్లాల్లో ద్రాక్ష ఎక్కువగా సాగు చేస్తారు. వాటి నిల్వకు కోల్డ్‌స్టోరేజ్‌ల ఏర్పాటు, ఎగుమతులకు వీలైన కార్గో విమాన సర్వీసులు కల్పించాలని డిమాండ్ ఉంది.

ధారవాడ జిల్లాలో...

ధారవాడను ప్రత్యేక పాలికెగా ప్రకటించినా గెజిట్ విడుదల చేయలేదు. ధారవాడకు రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కలగానే మిగిలింది. ధారవాడ యూనివర్సిటీలో ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే హాస్టల్ సౌకర్యాలు లేక గ్రామీణ ప్రాంత విద్యార్థులు పేయింగ్‌గెస్ట్ (పీజీ)లలో కష్టాలు పడుతున్నారు. నవలగుంద జౌళి పార్కుకు 2022 బడ్జెట్‌లోనే ప్రకటించినా ఇంతవరకు కాగితాలకే పరిమితమైంది. హుబ్బళ్ళి జిల్లాల్లోనే అనేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక్కడినేతలు కేంద్రస్థాయిలో ఉన్నత హోదాలలో ఉన్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు.

విజయపురలో..

జిల్లాకు చెందిన ఎంబీ పాటిల్ భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా శాశ్వతమైన ప్రాజెక్టుల ఏర్పాటులో వెనుకబడ్డారు. మైసూరు శాండల్ సోప్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రకటన ముందుకు కదలలేదు. విజయపురలో మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిన జరపరాదని ఆందోళన సాగుతున్నాయి. విజయపుర విమానాశ్రయం దాదాపు పూర్తయ్యింది.



విస్తరణకు నోచుకోని కొప్పళ స్టీల్ ప్లాంట్

గదగ్‌లో..

గదగ్ జిల్లాలో పర్యాటకకేంద్రాల అభివృద్ధికి నిపుణులు అధ్యయనం చేసి రూ.800 కోట్లు అవసరమని నివేదిక ఇచ్చారు. కానీ గ్రాంట్లు విడుదల కాలేదు. గదగ్-బేటగేరి జంటనగరాలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఏళ్ల తరబడి డిమాండ్ ఉంది. కప్పతగుడ్డను పర్యాటక కేంద్రంగా మార్చాలనే ప్రతిపాదన ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అనేలా ఉన్నాయి.

బాగల్కోటెలో...

బాగల్కోటె జిల్లాలో 1964లో ప్రారంభమైన కృష్ణా ఎగువ ప్రాజెక్టు ఆరు దశాబ్దాలు ముగిసినా సంపూర్ణం కాలేదు. విజయపురతో పాటు ఆరు జిల్లాల పరిధిలో 12.14 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించే భారీ ప్రాజెక్టు ఇది. తొలి, రెండో విడతల పనులు పూర్తి కావడంతో 6.12 లక్షల హెక్టార్లకు నీరు సమకూరుతోంది. మూడో విడత పనులు పూర్తయితే 6 లక్షల హెక్టార్లకు నీరు సమకూరనుంది.

హావేరిలో..

ఉమ్మడి ధారవాడ జిల్లా నుంచి విడిపోయి 28 సంవత్సరాలు అవుతున్న హావేరి నగరానికి తాగునీటి వ్యవస్థ లేదు. వరద, తుంగభద్ర నదులు జిల్లాలో ప్రవహిస్తున్నా వినియోగించుకునేలాంటి ప్రాజెక్టులు లేవు. జిల్లాలోని శిగ్గావిలో ప్రపంచంలోనే ఏకైక జానపద విశ్వవిద్యాలయం ఉంది. హావేరిలోనూ నూతనంగా ప్రారంభించారు. కానీ గ్రాంట్లు విడుదల చేయడం లేదు. హావేరి జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులు సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కల్యాణ కర్ణాటకలో...

కలబురగి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు అన్నీ విఫలమయ్యాయి. అఫ్జల్‌పురలోని స్వర్ణబీమా బ్యారేజ్, చించోళిలోని నాగరాళ, చంద్రంపల్లి జలాశయాలకు నీరు మళ్ళించే పనులకు గ్రాంట్ల కొరత వేధిస్తోంది. కలబురగిలో జౌళి పార్కు ప్రకటించి ఏళ్లు ముగుస్తున్నా ముందుకు కదలడం లేదు. కొత్తగా ఏర్పాటైన శెహబాద్, యడ్రామి, కమలాపుర, కాళగి తాలూకాలకు కనీసం ఆసుపత్రులు కూడా లేవు. జిల్లాలోని విమానాశ్రయం మూతపడే దిశకు చేరింది.

కొప్పళ జిల్లాలో...

కొప్పళ జిల్లా బల్డోటా, కిర్లోస్కర్, కల్యాణి స్టీల్స్, ముకుంద సుమి ఎక్స్ ఇండియా పరిశ్రమలు విస్తరణకు సిద్ధమయ్యాయి. అవి త్వరితగతిన పూర్తయితే జిల్లా రూపురేఖలు మారనున్నాయి. తుంగభద్ర జలాశయంలో 30 అడుగుల మేర పూడిక చేరడంతో జిల్లాకు సాగునీటి కష్టాలు కొనసాగుతున్నాయి. కనకగిరి తాలూకా నవళి గ్రామం వద్ద 13వేల కోట్లతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు డీపీఆర్ సిద్ధం చేశారు. అది ఎప్పటిలోగా పూర్తి అవుతుందని అంతు చిక్కనివిధంగా ఉంది. బీదర్ జిల్లాలో 1987 లో కారంజ ప్రాజెక్టులో భూమి కోల్పోయినవారికి పరిహారం ఇచ్చే అంశంలో నాలుగు దశాబ్దాలుగా సాధ్యం కాలేదు. కారంజ - మాంజ్రా నది జలాశయం ప్రదేశాలలో రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా 8.4 టీఎంసీల నీటిని బచావత్ ద్వారా వినియోగించుకోవాలనేది ప్రతిపాదనలకే పరిమితమైంది.

యాదగిరి జిల్లాలో...

యాదగిరి జిల్లాకేంద్రంగా మారి దశాబ్దన్నర కాలమైనా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు. మురుగునీరు సంస్కరణ చేయకుండానే బీమానదిలోకి చేరుతోంది. యాదగిరి రింగ్‌రోడ్డు కలగా ఉంది. కడేచూరు - బాడియాళ ప్రదేశంలో 3వేల ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారు. కేవలం రసాయనిక పరిశ్రమలు మినహా ఇతర ఇండస్ట్రీలు రాకపోయాయి. జిల్లాను వరినిధిగా పిలుస్తున్నా రైస్ మిల్లులు ఏర్పాటు కాలేదు. రైతులు ఇక్కడ మిరప, పత్తి, సాగు చేస్తారు. వాటికి గిట్టుబాటుధర సాధ్యం కావడం లేదు.

ఉమ్మడి బళ్లారి ..

బళ్ళారి జిల్లాను ఇటీవలే బళ్ళారి, విజయనగర జిల్లాలుగా మార్చారు. డిమాండ్ ఉందని జిల్లాలు విభజించారు గానీ ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. హొసపేటలో 250 పడకల ఆసుపత్రి కలగా ఉంది. జిల్లాలో సుమారు 600మంది పౌష్టికాహారలోపంతో చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. వారికి పోషకవిలువలు కల్గిన ఆహారాన్ని సమకూర్చే విషయంలో శాశ్వతమైన విధానాలు పాటించడం లేదు. హంపి కన్నడ విశ్వవిద్యాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏకైక పరిశోధనా సంస్థగా గుర్తించినా అధ్యాపకులు గ్రాంట్ల కొరత సమస్యగా మారింది.

రాయచూరు...

రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో కీలకమైనదిగా పేరుంది. నారాయణపుర కుడి కాలువ 150 కిలోమీటర్లు విస్తరింపచేసి రాంపుర వద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు ముగించారు. కానీ కొన్నేళ్లగా రైతులకు పరిహారం అందడం లేదు. కృష్ణభాగ్య జలనిగమ కింద నారాయణపుర కుడికాలువ విస్తరణ పనులు 13ఏళ్లుగా సాధ్యం కావడం లేదు. జిల్లాలో 100కుపైగా జిన్నింగ్ ఫ్యాక్టరీలు ఉన్నా జౌళి పార్క్ ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదు. ఇలా కిత్తూరు, కల్యాణ కర్ణాటక జిల్లాలు వెనుకబాటుతోనే కొనసాగుతున్నాయి. శాసనసభ సమావేశాల్లో ఈ జిల్లాలకు సంబంధించి ఎంతమేర చర్చలు ఫలిస్తాయోనని ఈ ప్రాంత వాసులు ఎదురుచూస్తున్నారు.



సభలో సభ్యులు.. స్పీకర్ బసవరాజ్ హొరట్టి

సభలో నివాళి అర్పిస్తున్న సభ్యులు



దివంగత నేతలకు ఉభయసభల నివాళి

● సంతాపం తర్వాత శాసనసభ వాయిదా ● పరిషత్‌లో కొనసాగిన కలాపాలు

బెంగళూరు/బళ్లారి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాల ప్రారంభం రోజున సోమవారం శాసనసభలో స్పీకర్ యూటీ ఖాదర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మాజీ ఎమ్మెల్యే ఆర్‌వీ దేవరాజ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హెచ్‌వై మేటి, జానపద కళాకారుడు డాక్టర్ ఎస్‌ఆర్ నాయక, ప్రముఖ రచయిత ఎస్‌ఎల్ భైరప్ప, సాలుమరద తిమ్మక్క, మాజీ ఎంపీ నటుడు ధర్మేంద్ర, హాస్యనటుడు ఎంఎస్ ఉమేశ్, శివశరణప్పగౌడ పాటిల్‌లకు నివాళులు అర్పించారు. సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ తుమకూరు జిల్లా గుబ్బి తాలూకాలో జన్మించిన తిమ్మక్క సంతానం లేదని మొక్కలనే కన్నబిడ్డలుగా పెంచుకున్నారన్నారు. తిమ్మక్క స్ఫూర్తితో 284 పిల్లలు అనే డాక్యుమెంటరీ నిర్మితం కాగా అంతర్జాతీయస్థాయిలో పేరొందిందన్నారు. భారతప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించిందని కొనియాడారు. సాలుమరద తిమ్మక్క పేరిట పురస్కారాన్ని ప్రదానం చేస్తామని ప్రకటించారు. విద్యాసంస్థలలో పేదలకు ఉచితంగా వసతి కల్పిస్తూ ఎంతోమందికి చేదోడుగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే నరహరిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎస్‌ఎల్ భైరప్ప జీవితకాలం రచనల ద్వారా ఎంతోమందిని ఆకట్టుకున్నారన్నారు. హాసన్ జిల్లాలో జన్మించిన ఆయన సైకాలజీ అధ్యాపకుడిగా సేవలందించారన్నారు. కన్నడ సాహిత్య రంగానికి ఆయన సేవలు అజరామరం అన్నారు. మైసూరులో ఎస్‌ఎల్ భైరప్ప స్మారకాన్ని నిర్మిస్తామన్నారు. ధర్మేంద్ర హిందీ నటుడైనా కన్నడతో సంబంధం ఉండేదన్నారు. కన్నడ సినిమాలు గంధదగుడి, తాయిగెతక్క మగ, హులి-హెబ్బులి సినిమాలను రీమేక్ చేశారన్నారు. నటుడిగానే కాక మాజీ ఎంపీగా సేవలందించిన ధర్మేంద్రకు పద్మభూషణ్ వరించిందన్నారు. హెచ్‌వై మేటికి బాగల్కోటెలో ఎంతో మంచి పేరు ఉండేదన్నారు. రాష్ట్రమంత్రిగా, లోక్‌సభ సభ్యుడిగా వ్యవహరించాడని, ప్రస్తుతం శాసనసభ సభ్యుడిగా కొనసాగుతున్నారన్నారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారన్నారు. ఆయన దశాబ్దాలుగా ప్రజాసేవకే అంకితమయ్యారన్నారు. ప్రతిపక్షనేత అశోక్, మంత్రి పరమేశ్వర్ సహా, అధికార, ప్రతిపక్ష సభ్యులు సంతాప తీర్మానాలలో పాల్గొన్నారు. చివరిగా స్పీకర్ యూటీ ఖాదర్ శాసనసభ సంతాప తీర్మానాలను వారి కుటుంబాలకు పంపుతామన్నారు. సభను మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.



మాట్లాడుతున్న సీఎం

పాత్రికేయుడు జార్జ్‌కు సంతాపం

పత్రికారంగంలో సుదీర్ఘసేవలు అందించిన టీజేఎస్ జార్జ్ మృతికి పరిషత్‌లో సంతాపం తెలిపారు. కేరళలో జన్మించి ఇంగ్లీష్ హానర్స్ చదివిన ఆయన ముంబైలో ది ఫ్రీప్రెస్ జనరల్‌లో పాత్రికేయుడిగా వృత్తిని ప్రారంభించినట్టు సభాపతి తెలిపారు. ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్, ది సెర్చ్‌లైట్ ఫర్ ఎకనామిక్స్ రివ్యూ ఏసియా వీక్ ఫౌండర్ ఎడిటర్‌గాను కొనసాగారన్నారు. సుదీర్ఘ కాలం ఆయన పాత్రికేయ, సాహిత్య రంగాల్లో సేవలందించారన్నారు. పాయింట్ ఆఫ్ వ్యూ పేరిట 25ఏళ్లపాటు రాసిన 1300 కాలమ్స్ నేర మాతు పేరిట కన్నడలోనూ ప్రచురితమైనట్టు తెలిపారు. ఆయనకు పద్మభూషణ్‌తోపాటు ఎన్నో పురస్కారాలు దక్కాయన్నారు.



సభ బయట నిలిపిన వాహనాలు

మా రక్తంలో కన్నడ ఉంది : మంత్రి మధు బంగారప్ప

బెంగళూరు/బళ్లారి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'మా రక్తంలో కన్నడ ఉంది అదే మా శ్వాస అని ఎట్టి పరిస్థితుల్లోనూ కన్నడ పాఠశాలలను మూసే ప్రసక్తే లేదు' అని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప అన్నారు. పరిషత్ ప్రశ్నోత్తరాల వేళ చిదానంద గౌడ ప్రశ్నకు సమాధానంగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో 900 ప్రభుత్వ పాఠశాలలను కర్ణాటక పబ్లిక్ స్కూల్స్‌ను ఉన్నతీకరిస్తున్నామని, రానున్న రోజుల్లో అన్ని గ్రామపంచాయతీల్లోనూ కర్ణాటక పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభిస్తామన్నారు. కన్నడ పాఠశాలలను మూసేసే ప్రసక్తే లేదన్నారు. బడ్జెట్‌లో 500 పబ్లిక్ స్కూల్స్‌ను ప్రారంభిస్తామని ప్రకటించామని, అందుకు అనుగుణంగానే 309 పాఠశాలలు ప్రగతి దశలో ఉన్నాయన్నారు. 2.72 లక్షలమంది పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నారన్నారు. ఉపాధ్యాయులు లేని కారణంగా గెస్ట్ రూపంలో నియమించుకున్నామన్నారు. ప్రతి పబ్లిక్‌స్కూల్‌లో 1200 మంది విద్యార్థులకు అవసరమైన సౌలభ్యాలు ఉండేలా నిర్మిస్తామన్నారు. సభ్యులు జగదేవ్ గుత్తేదార్, కేశవ్‌ప్రసాద్‌లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు బూట్లు, సాక్సుల కోసం రూ.111.88 కోట్లు విడుదల చేశామన్నారు. 44,525 పాఠశాలలకు గ్రాంట్లు విడుదల అయ్యాయన్నారు.

కృష్ణజింకల మృతికి వైరస్ కారణం: మంత్రి ఖండ్రె

బెళగావి భూతరామనహట్టిలోని కిత్తూరు రాణి చన్నమ్మ జూలో 40 కృష్ణ జింకల మృతికి వైరస్ సోకడమే కారణమని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె వెల్లడించారు. పరిషత్‌లో సభ్యుడు తలవారసాబణ్ణ ప్రశ్నకు సమాధానంగా కృష్ణ జింకలు 'హెమరాజిక్ సెప్టెసేమియా' అనే వైరస్‌కు గురైనట్లు ధ్రువీకరణ అయ్యిందన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం లేదు

ఆపరేషన్ వేళ బెళగావి డాక్టర్ల నిర్లక్ష్యం లేదని వైద్య విద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్‌పాటిల్ అన్నారు. పరిషత్‌లో నాగరాజు యాదవ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి వివరణ ఇచ్చారు. బీమ్స్ సంస్థలో ఆపరేషన్‌ల వేళ డాక్టర్ల ద్వారా ఏ నిర్లక్ష్యం జరగలేదన్నారు. ఓ రోగి కడుపులో గడ్డకు బదులు పేగులు తొలగించారనే ప్రచారంపై మాట్లాడుతూ రోగి దీర్ఘకాలంగా మద్యానికి బానిస అని, పొగాకు వాడేవారన్నారు. ఆసుపత్రికి వచ్చేసరికే అతను తీవ్రమైన సమస్యతో ఉన్నాడన్నారు.

రైతు ఆత్మహత్యల్లో

దేశంలోనే రెండో స్థానం

● ప్రతిపక్ష నాయకుడు అశోక్



బళ్లారి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభం అయి రెండున్నరేళ్లు ముగసిందని, ఈ అవధిలో 2,400 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని విధానసభ ప్రతిపక్ష నాయకుడు బీజేపీ నాయకుడు ఆర్. అశోక్ మండిపడ్డారు. బెళగావిలో శీతాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఏ ప్రభుత్వం అయినా రైతుల కోసం పనిచేస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల సంక్షేమంపై ఆసక్తి లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి మాట మరిచి సీఎం కుర్చీ కోసం లాగులాట పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని, వరదలు, ప్రకృతి విపత్తులు వచ్చినా రైతులకు పరిహారం ఇవ్వలేకపోతున్నారన్నారు. సమావేశాల్లో నష్టం, కష్టంపై ప్రశ్నించకుండా గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

అనవసరంగా సిజేరియన్ చేస్తే చర్యలు: మంత్రి దినేశ్ గుండూరావు

డబ్బులు సంపాదనే లక్ష్యంగా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు సిజేరియన్‌లు చేస్తున్నారని సభ్యుడు గోవిందరాజు అడిగిన ప్రశ్నకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో అవసరం లేకున్నా సిజేరియన్ చేసే ప్రైవేట్ ఆసుపత్రి ఏదైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిజేరియన్‌లకు సంబంధించి జిల్లా, కేపీఎంఈలో ఫిర్యాదులు లేవన్నారు. గర్భిణీలకు పరీక్షలు చేసేవేళ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు వ్యవహరించాల్సిన మార్గదర్శకాలు ఉన్నాయన్నారు.

రేపు 'ఉత్తర' సమస్యలపైనే చర్చలు

● నియామకాల్లో అవినీతి నిరూపిస్తే రాజీనామా ● పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బెళగావిలో జరుగుతున్న శాసనసభ శీతాకాల సమావేశాల్లో బుధవారం ఉత్తరకర్ణాటకకు చెందిన అంశాల పైనే సంపూర్ణంగా చర్చలు జరుపుతామని విధానపరిషత్ సభాపతి బసవరాజహొరట్టి తెలిపారు. సోమవారం శాసనసభ కలాపాలకు ప్రారంభానికి ముందు సువర్ణసౌధలో తయన మీడియాతో మాట్లాడారు. వరుసగా బెళగావి కలాపాలలో చర్చలకు అవకాశం ఉంటుందని కానీ పలు కారణాలతో అడ్డంకులు ఏర్పడ్డాయన్నారు. 145వ విడత సమావేశాల్లో ఆరున్నర గంటల పాటు, 151వ విడత కలాపాలలో 1.40 గంటల పాటు, 154వ విడత కలాపాలలో 5.12 గంటలు చర్చలు ఉత్తరకర్ణాటక అంశాలపైనే చర్చలు జరిగాయన్నారు. ప్రస్తుత కలాపాలలో బుధవారం ఉత్తర కర్ణాటక అంశాలకు పరిషత్‌లో చర్చలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఇలా పదిరోజుల వ్యవధిలో కనీసం రెండురోజులపాటు చర్చలు జరుపుతామన్నారు. ప్రభుత్వంతో పాటు అధికార, ప్రతిపక్ష సభ్యులు సహకరించాలన్నారు. 157వ పరిషత్ సమావేశాలలో 1649 ప్రశ్నలను స్వీకరించామని వీటిలో 684 చుక్క గుర్తు ప్రశ్నలు కాగా 684 చుక్క రహిత ప్రశ్నలు ఉన్నాయన్నారు.

సభాపతి సవాల్

విధానపరిషత్ నియామకాలలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సభాపతి హొరట్టి సవాల్ విసిరారు. పరిషత్ సచివాలయానికి సంబంధించి నియామకాల్లో అవినీతి జరిగినట్లు కాంగ్రెస్ సభ్యుడు నాగరాజ యాదవ్ ఆరోపించారని కానీ సాక్ష్యాలు చూపలేదన్నారు. అతడు నిరూపిస్తే రాజీనామా చేస్తానని, సాధ్యంచేయలేకపోతే తప్పు చెప్పినట్లు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ఎగ్జామినేషన్ అథారిటీ (కేఈఏ) ద్వారానే నియామకాలు జరిగాయన్నారు. తాను జోక్యం చేసుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు కొంతకాలంగా పరిషత్‌లో మెజారిటీ సాధ్యమైందని సభాపతిపై అవిశ్వాసం పెడతారనే వ్యాఖ్యలపైనా స్పందించారు. సభ తీర్మానాలను పాటిస్తానన్నారు. అవిశ్వాసం ప్రవేశపెట్టడమనేది ప్రభుత్వానికి సంబంధించిన విషయమన్నారు. ఏడాదికిందట బెళగావి కలాపాలలో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్, సీటీ రవిల మధ్య చోటుచేసుకున్న వివాదాన్ని పాలసీ కమిటీకి అప్పగించామని నివేదిక వచ్చాక పరిశీలిస్తానన్నారు.



విన్నర్.. గేమ్ చేంజర్

● కేఏకేఎస్‌సీఏ ఎన్నికల్లో వెంకటేశ్ ప్రసాద్ దిగ్విజయం ● 191 ఓట్లతో గెలుపు

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):గేమ్‌చేంజర్ టీం పేరుతో విస్తృత ప్రచారం చేపట్టి, పోటాపోటీగా బరిలో దిగిన వెంకటేశ్ ప్రసాద్ కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ఎన్నికల్లో దిగ్విజయం సాధించారు. పలు వివాదాలు, గందరగోళం తర్వాత ఆదివారం ఎన్నికలు సజావుగా సాగాయి. రాత్రి 7 గంటలవరకు పోలింగ్ జరిగింది. 1301మంది ఓట్లు వేశారు. 749 ఓట్లు వెంకటేశ్ ప్రసాద్ సాధించగా, ఆయన ప్రత్యర్థి కేఎన్ శాంతకుమార్ 558 ఓట్లు పొందారు. 191 ఓట్ల తేడాతో వెంకటేశ్ ప్రసాద్ గెలుపు సాధించారు. 2025 నుంచి 2028 వరకు ఆయన సారథ్యంలోని పాలకవర్గం కొనసాగనుంది. పాలకమండలి లోపాలతో సుమారు దశాబ్దకాలం తర్వాత వెంకటేశ్ ప్రసాద్ పోటీ చేయాల్సి వచ్చింది. అనిల్‌కుంబ్లె, జవగళ్ శ్రీనాథ్ కలసి పనిచేశారు. వెంకటేశ్ ప్రసాద్ టీమ్‌కు చెందిన వినయ్ మృత్యుంజయ కార్యదర్శి స్థానం పోటీలో నామినేషన్ తిరస్కరణకు గురైనా 11మంది వీరివర్గమే విజయం సాధించింది. 2010 నుంచి మూడేళ్లపాటు ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన వెంకటేశ్ ప్రసాద్ టీమిండియా తరపున 33 టెస్టులు, 161 వన్డేమ్యాచ్‌లు ఆడారు. టెస్టుల్లో 96, వన్డేలలో 196 వికెట్లు సాధించారు.

● వెంకటేశ్ ప్రసాద్ విజయంపై ప్రముఖ క్రికెటర్లు అనిల్‌కుంబ్లె, జవగళ్ శ్రీనాథ్ తదితరులు టీమ్ గేమ్‌చేంజర్ వర్గానికి మద్దతు ఇచ్చారు. క్రికెట్ అసోసియేషన్ గౌరవాన్ని తిరిగి పునరుద్ధరించడమే లక్ష్యమని ప్రచారం చేశారు. బెంగళూరుతోపాటు ఇతర ప్రాంతాలలోనూ క్రికెట్‌కు ప్రోత్సాహం కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాంతరంగస్వామి మద్దతుతో మహిళా సభ్యుల బలం పెరిగింది.

● శాంతకుమార్ ఓటమికి క్రికెట్‌తో సంబంధం లేని వ్యక్తి కావడం, బ్రిజేశ్ పటేల్ గ్రూప్‌లో కొనసాగడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వర్గంతో ఉండడం, గత పాలకవర్గంలో ఉండే కొందరు మళ్లీ పోటీ చేయడం, టీమ్ బ్రిజేశ్‌గా రంగంలోకి దిగడం వంటివి కారణాలుగా ఉన్నాయి. కొత్త కమిటీలో వెంకటేశ్ ప్రసాద్ అధ్యక్షుడు కాగా సుజిత్ సోమసుందర్ ఉపాధ్యక్షుడు, కార్యదర్శిగా సంతోష్ మీనన్, జాయింట్ సెక్రటరీగా టీకే రవి, కోశాధికారిగా బీఎన్ మధుకర్ ఉన్నారు. లైఫ్‌టైం సభ్యులలో వీఎం మంజునాథ్, శైలేష్ ఎస్ పోల్, బెంగళూరు డివిజన్‌లో కల్పనా వెంకటాచార్, అశిష్ అమర్‌లాల్, అవినాశ్‌వైద్య, మైసూరు విభాగంలో శ్రీనివాసప్రసాద్, శివమొగ్గ పరిధిలో డీఎస్ అరుణ్, తుమకూరు లో సీఆర్ హరీశ్, ధారవాడ డివిజన్‌లో వీరణ్ణ సవది, రాయచూరు డివిజన్‌లో కుశాల్ పాటిల్ గాడ్గి, మంగళూరులో శేఖర్ ఐశెట్టి గెలుపొందారు.

కొత్త కమిటీ ముందు సవాళ్లు

చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్‌సీబీ విజయోత్సవాల వేళ జరిగిన తొక్కిసలాట నుంచి తలెత్తిన చెడ్డపేరును తప్పించాలి, పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి, స్థానిక క్రికెటర్‌లకు అవకాశం కల్పించాలి. జాతీయ జట్టుకు కన్నడిగులను పంపేలా ప్రోత్సాహం ఇవ్వాలి.

రాయలసీమలో వందేమాతరం స్ఫూర్తి

● లోక్‌సభలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



అనంతపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం స్ఫూర్తి దేశంలోని సుదూర ప్రాంతాలకు సైతం చేరిందని, రాయలసీమకు, మరీ ముఖ్యంగా అనంతపురం జిల్లాకు విస్తరించిందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. దేశభక్తికి ప్రతీకగా నిలిచిన 'వందేమాతరం' జాతీయ గీతాన్ని రచించి 150 ఏళ్లు అయిన సందర్భంగా లోక్‌సభలో సోమవారం జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొన్నారు. రాయలసీమ ప్రాంత పోరాట స్ఫూర్తిని, వీరగాథలను ఆయన ప్రస్తావించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, పెద్దవడుగూరు, హిందూపురం ప్రాంతాలను మహాత్మా గాంధీజీ సందర్శించారని, స్వాతంత్య్రోద్యమంలో చేరాలని ప్రజలకు పిలుపునిచ్చారని అన్నారు. 1946లో బ్రిటీష్‌వారు అనంతపురం నుంచి బళ్లారికి అటవీ సంపదను తరలిస్తుంటే.. అడ్డుకునేందుకు కొత్తపల్లి గ్రామస్థులు ఒక వంతెనను ధ్వంసం చేశారని, అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని అన్నారు. దీనికి ఆగ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం గ్రామస్థులకు రూ.5 వేల భారీ జరిమానా విధించారని అన్నారు. స్వాతంత్య్రానంతరం ఆ సొమ్మును భారత ప్రభుత్వం ఆ గ్రామానికి తిరిగి చెల్లించిందని, గ్రామస్థులు ఆ సొమ్ముతో ఊరిలో ప్రాథమిక పాఠశాలను నిర్మించారని, ఇది వందేమాతరం స్ఫూర్తికి నిదర్శనమని కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వందేమాతరం గీతానికి ఆకర్షితులై, యుక్త వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని వీరమరణం పొందారని, తెలుగు వారి పౌరుషం ఎలా ఉంటుందో చాటి చెప్పారని అన్నారు. వందేమాతరం ఆత్మ సామాన్య ప్రజల్లోనూ సజీవంగా ఉందని అన్నారు.

నిర్దిష్ట వ్యవధిలో పరిష్కారం: ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలకు నిర్దిష్ట వ్యవధిలోగా పరిష్కారం చూపుతామని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై స్వేచ్ఛగా అర్జీలు అందించవచ్చునన్నారు. బాధితులు ఎవరైనా, దేనికీ భయపడకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజాసేవే ధ్యేయంగా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. అర్జీలకు చట్టపరిధిలో వేగంగా పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. కాగా 128 అర్జీలను ప్రజల నుంచి వచ్చినట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్‌బాషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపట్నుంచి టెట్: కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం అర్బన్, కొత్తచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10 నుంచి 21వతేదీ వరకు టెట్ నిర్వహిస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం టెట్ నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామని, సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 4,520 మంది టెట్‌కు హాజరవుతారని డీఈవో కిష్టప్ప తెలిపారు. పుట్టపర్తి, బెంగుళూరులో ఒక్కో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు గుర్తింపుకార్డులతో గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఈవో లీలలు

కదిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆలయ ఆస్తులు, దేవుళ్ల ఆభరణాలు, భక్తులిచ్చే విరాళాలను పరిరక్షించాల్సిన ఈవోనే దోచేశాడు. పబ్లిక్‌గా అమ్మవారి ఆభరణాలను చోరీ చేసుకెళ్తూ పట్టుబడ్డాడు. కదిరి మండలంలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయ ఈవో మురళీక్రిష్ణ ఆదివారం చేతివాటం ప్రదర్శించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయన కదిరి ప్రాంతంలోని ఏడు దేవాలయాలకు కార్యనిర్వాహణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలోనే ఇంత దోచుకుంటే.. నల్లచెరువు మండలంలో ప్రసిద్ధిచెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి, మిగిలిన దేవాలయాల్లో ఎంత దోచుకున్నారో అని భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పాలపాటిదిన్నె ఆలయంలో ఈవోకి చేదోడుగా ఉంటున్న ఓ వైసీపీ నాయకుడు పెత్తనం చెలాయిస్తున్నాడు. అన్నదానం మొదలుకుని లడ్డూల వరకు అన్నింటా ఆయనదే హవా అన్న చర్చలు వినిపిస్తున్నాయి. భక్తులు సమర్పించిన సొమ్ములకు లెక్కాపత్రం లేకుండా పోయింది. స్వామివారికి అందే విరాళాలు కొంత అయితే, అధిక మొత్తంలో ఈవో, వైసీపీ నాయకుడు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నదానంతోపాటు, స్వామివారిని ప్రత్యేక దర్శన టికెట్ల రూపంలో ప్రతి శనివారం రూ.30వేల వరకు ఆదా యం ఉంటుంది. శ్రావణమాసం అయితే వారం వారం రూ.లక్షల్లో ఆ దాయం సమకూరుతుంది. ఎర్రదొడ్డి గంగమ్మ అమ్మవారిని ప్రతి ఆది, మంగళవారాల్లో వివిధ రూపాల్లో అలంకరిస్తారు. గంగమ్మ వద్ద బ లిచ్చే ప్రతి జంతువుకు రూ.వంద వసూలు చేస్తారు. వందల సంఖ్యలో బలులు జరుగుతుంటాయి. ఆ సొమ్ము అంతా ఎక్కడికి పోతుందో తెలియని పరిస్థితి. పాలపాటిదిన్నెలో అన్నదానానికి వచ్చిన భక్తులు విరాళాలు ఇస్తారు. అవి కొన్నింటికి రసీదులిస్తుంటే, మరికొన్నింటికి ఇవ్వకుండా ఈఓతోపాటు వైసీపీ నాయకుడు జేబుల్లోకి వేసుకుంటున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. శ్రావణమాసంపూర్తయ్యాక కూడా ఈవో సొంతంగా ఈ ఏడాది ఆగస్టు 18న చెక్కు ద్వారా రూ.2.50 లక్షలు డ్రా చేసుకున్నారు. ఆలయంలో ఖర్చులు, వస్తువుల కొనుగోళ్లకు చెక్కులు వారి పేరుతో ఇస్తారు. ఈవో మురళీక్రిష్ణ ఏకంగా రూ.2.50 లక్షలు తన పేరుతో డ్రా చేసుకున్నారు. ఆ సొమ్ము ఎందుకు ఖర్చుపెట్టారో తేలాల్సి ఉంది. ఇలాంటివి కోకొల్లలు అని ఆయా ఆలయాల సిబ్బంది పేర్కొంటున్నారు. పాలపాటిదిన్నె, ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయాల్లో భక్తులిచ్చే విరాళాల లెక్క తప్పిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలపాటిదిన్నెలో అధికారికంగా ఒక విరాళాల పుస్తకం రాస్తే, ఆలయంలో హవా నడిపిస్తున్న వైసీపీ నాయకుడు, ఈఓ సొంతంగా ముద్రించుకున్న మరో పుస్తకాన్ని వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఈఓ ఏడాపెడా ఆలయ సొమ్ము ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

రామగిరి డీటీ అరెస్టు

అతడి తల్లిదండ్రులు కూడా..

అమూల్య, ఆమె కొడుకు మృతి కేసులో 14 రోజుల రిమాండ్

అనంతపురం క్రైం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): నగరంలో కుమారుడిని చంపి అమూల్య ఉరి వేసుకున్న కేసులో ఆమె భర్త రామగిరి డిప్యూటీ తహసీల్దార్ బండమీద రవిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం వెల్లడించారు. గతనెల 27వ తేదీన నగరంలోని జేఎన్టీయూ రోడ్డులో గల ఇంట్లో నాలుగేళ్ల కుమారుడి గొంతు కోసి, అమూల్య ఆత్మహత్య చేసుకుంది. దీనిపై అమూల్య తండ్రి రామకృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. అందులో భాగంగా అమూల్య భర్త రవి, అత్తమామలు శివాంజినమ్మ, కుళ్లాయప్పను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించింది.

స్ఫూర్తి పతాక.. దీపిక

మడకశిర/మడకశిరటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు అంధత్వం అడ్డుకాదని నిరూపిస్తూ, దేశం గర్వించేలా టీ-20 క్రికెట్ ప్రపంచకప్ సాధించిన దీపిక ఎందరికో స్ఫూర్తి అని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. అంధుల టీ-20 క్రికెట్‌లో భారత జట్టును ప్రపంచ విజేతగా నిలిపిన కెప్టెన్ దీపికను సోమవారం మడకశిరలో ఘనంగా సన్మానించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సాధించాలి అన్న పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చని దీపిక నిరూపించిందన్నారు. హేళనలు పట్టించుకోకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అకుంఠిత దీక్షతో దేశ చరిత్రలో తనపేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుందని ప్రశంసించారు. దేశ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య వంటి గొప్ప వ్యక్తుల చేత మెప్పు పొందిన క్రీడాకారిణిగా దీపిక నిలిచిందన్నారు. ఆమె ప్రతిభకు ప్రోత్సాహకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.10లక్షలు, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు రూ.2లక్షలు, తాను రూ.2.16లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు.



దీపికకు క్రికెట్ బ్యాట్లతో గౌరవ వందనం



దీపికకు చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, క్రీడాకారులు

కష్టపడితే ఏదైనా సాధ్యమే..: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

లక్ష్యం చేరాలనే సంకల్పం ముందు పేదరికం, దివ్యాంగత్వం వంటివి ఏవీ అడ్డురావని, కష్టపడితే సాధించలేదని ఏమీ ఉండదని నిరూపించిన క్రీడాకారిణిగా దీపిక నిలిచారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ప్రపంచపటంలో మడకశిర పేరును నిలిపిన దీపికను మనందరం సత్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మడకశిర ప్రాంత విద్యార్థులు మరో దీపికలా విజయాలను అందుకొని ఈప్రాంతానికి కీర్తిని తీసుకురావాలని కోరారు.

రోల్ మోడల్: సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

దీపిక అంధుల టీ-20 ప్రపంచకప్‌ను భారత్‌కు అందించి రోల్‌మోడల్‌గా నిలిచారని పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి అన్నారు. అనుకొన్నది సాధించడానికి పేదరికం, దివ్యాంగత్వం, హేళనలు అడ్డుకాదని నిరూపించిన దీపిక ఎందరి కో ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యార్థులు ఆమె స్ఫూర్తిగా రాణించాలన్నారు.

మట్టిలో మాణిక్యం: సాయికుమార్, సినీనటుడు

మన మట్టిలో పుట్టిన మాణిక్యం దీపిక అని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ ప్రశంసించారు. ప్రతి విద్యార్థి దీపికను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలన్నారు. మొట్టమొదటి అంధుల టీ-20 ప్రపంచకప్పును అందించి దేశం అంతా తనవైపు చూసేలా నిలిచిన గొప్ప క్రీడాకారిణి దీపిక అని అన్నారు.

ఆత్మస్థైర్యంతో..: గుండుమల, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆత్మస్థైర్యం, బలమైన విశ్వాసంతో ముందుకు సాగితే సాధించలేనిది ఏమీ లేదని దీపిక నిరూపించిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. మడకశిర పేరును ప్రపంచస్థాయిలో పరిచయం చేసిన దీపిక ప్రతిభ ప్రశంసనీయమన్నారు. దీపికను అందరూ స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలన్నారు.

కృషితోనే గుర్తింపు: కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

నిరంతరం కృషి, పోరాటం వల్ల దీపిక తాను అనుకొన్న లక్ష్యాన్ని సాధించారని కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌లు అన్నారు. దీపిక సన్మాన సభలో వారు మాట్లాడుతూ హేళనలు ఎదురైనా నిరుత్సాహ పడకుండా కలలుగన్న లక్ష్యాన్ని దీపిక చేరారని ప్రశంసించారు. ఆమె ప్రతిభ ముందు అంధత్వం కూడా చిన్నబోయిందన్నారు. ప్రతి ఇబ్బందిని అవకాశంగా మలుచుకుని నేడు భారత జట్టును ప్రపంచ విజేతగా నిలిపిందని అభినందించారు. అమరాపురం మండలం తంబాళహట్టి గ్రామానికి చెందిన దీపిక భారత అంధుల టీ-20 జట్టు కెప్టెన్‌గా ప్రపంచకప్ సాధించి తొలిసారి మడకశిరకు వచ్చారు. ర్యాలీని నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి, సినీనటుడు సాయికుమార్‌తో కలిసి దీపిక ర్యాలీలో పాల్గొన్నారు. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.



అవమానాలు, విమర్శలు అధిగమించి..: దీపిక, అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్

చిన్నప్పటి నుంచి ఎదురైన అవమానాలు, విమర్శలు నాలో పట్టుదలను పెంచాయి. దాని ఫలితమమే నేటి నా విజయమని అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక అన్నారు. 2019లో కర్ణాటకలో అంధుల క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం, కోచ్ మహంతేష్ సహకారం వల్లే జాతీయ జట్టుకు సారథ్యం వహించే సామర్థ్యం వచ్చినట్లు తెలిపారు. అందరి సహకారం వల్లే మొదటిసారి జరిగిన అంధుల టీ-20 ప్రపంచకప్‌లో జట్టును విజేతగా నిలిపినట్లు పేర్కొన్నారు. కప్పు సాధించడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మడకశిర ప్రాంత ప్రజలు చూపిన ఆదరణ జీవితంలో మరువలేనన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సహకారం కూడా మరువలేనన్నారు.

నో రికవరీ..!

ఆకుతోటపల్లిలో రూ.17లక్షలు స్వాహా

సొంత ఖాతాల్లోకి జమచేసుకున్న మాజీ యానిమేటర్, మరో లీడర్

పోలీసులకు ఫిర్యాదుతో సరిపెట్టిన అధికారులు



వెన్నెల మండల సమైక్య కార్యాలయం

అనంతపురంరూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యుల సొమ్ము స్వాహాపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అనంతపరం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి మహిళా సంఘాలకు సంబంధించిన రూ.17 లక్షలకు పైగా డబ్బును మాజీ యానిమేటర్‌తో పాటు ఓ గ్రూపు లీడరు కాజేశారు. గ్రూపు సభ్యులకు తెలియకుండా సొంత ఖాతాల్లోకి జమచేసుకున్నారు. సంబంధిత అధికారుల విచారణలో కూడా వ్యవహారం బట్టబయలయింది. ఆ మేరకు సదరు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదంతా జరిగి మూడు నెలలు గడిచిపోయింది. ఇంత వరకు సొమ్ము రికవరీపై ఒక్క అడుగు ముందుకు పడలేదు. పోలీసుల తీరు అంతకంటే అధ్వానంగా ఉందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు.

రూ.17.63 లక్షలు స్వాహా

ఆకుతోటపల్లిలో జనని గ్రామ సంఘం తరపున 30, అశ్వని గ్రామ సంఘం తరుపున 55 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 8 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సభ్యుల సొమ్మును మాజీ యానిమేటర్ శ్రీలేఖ, ఓ సంఘం లీడర్‌గా వ్యవహరించిన షాహీదా స్వాహా చేశారు. గ్రూపు సభ్యులకు తెలియకుండా తమ సొంత ఖాతాల్లోకి రూ.17,63,800 జమ చేసుకున్నారు. ఈ సొమ్ములో రూ.7.62లక్షలు యానిమేటర్ తన వ్యక్తి గత బ్యాంకు ఖాతాకు జమ చేసుకుంది. మిగతా సొమ్మును తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు సంబంధిత అధికారుల విచారణలో బయటపడింది.

ఫిర్యాదుతో సరిపెట్టిన అధికారులు

మహిళా సంఘాలకు సంబంధించిన సొమ్ము స్వాహా వ్యవహారం ఆగస్టులో బయట పడింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఆ మేరకు నిధుల స్వాహా నిజమేనని నిర్ధారించారు. సెప్టెంబరులో ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసి అంతటితో అధికారులు సరిపెట్టుకున్నట్లు తెలుస్తోంది. సొమ్ము రికవరీలో జరుగుతున్న జాప్యంపై మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు పోలీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. సొమ్ము కాజేసిన యానిమేటర్‌ను రెండు, మూడుసార్లు పోలీసులకు పట్టించినా ప్రయోజనం లేకుండాపోయిందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం యానిమేటర్, లీడర్ ఇద్దరూ పరారీలో ఉన్నారంటూ పోలీసులు చెబుతున్నారని మహిళా సంఘాల సభ్యులు అంటున్నారు. ఏమైనా మాట్లాడితే.. మీరే పట్టుకురండి అంటూ పోలీసులు మాట్లాడుతున్నారని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



సంఘంలో తీసుకున్న అప్పులు చెల్లించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పుడు సంఘంలో తొమ్మిది మంది సభ్యులకు సంబంధించి రూ.4లక్షలు సొమ్మును యానిమేటర్ కాజేసింది. ఏం చేయాలో తెలియని పరిస్థితి. సంఘాల్లో జరిగిన విషయం గురించి కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశాం. అయినా ప్రయోజనం లేకుండాపోయింది.

-సావిత్రమ్మ, సభ్యురాలు, ఆరుణోదయ గ్రూపు

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఆకుతోటపల్లిలో జనని, అశ్వని గ్రామ సంఘంలోని 8 సంఘాలల్లో రూ.17 లక్షలు దుర్వినియోగం జరిగింది. గతంలో పనిచేసిన యానిమేటర్ శ్రీలేఖ, మరో సంఘం లీడర్ షాహీదా సొంత ఖాతాల్లోకి జమ చేసుకున్నారు. దుర్వినియోగమయిన సొమ్ములో యానిమేటర్ నుంచి రూ.1.80 లక్షలు, సంఘం లీడర్ నుంచి రూ.లక్ష రికవరీ చేశాం. స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. బ్యాంకర్లతోనూ మాట్లాడి సంఘం సభ్యులను ఇబ్బంది పెట్టొదని కోరాం.

-రవి, ఏపీఎం

రెండు, మూడు సార్లు పట్టించాం



రాత్రిళ్లు మేలుకుని సొమ్ము కాజేసిన యానిమేటర్‌ను పట్టుకుని పోలీస్టేషన్‌కు అప్పగించాం. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంత వరకు ఒక్కరుపాయి కూడా వసూలయింది లేదు. పోలీసుల నుంచి సరైన సమాధానం లేదు. చేసేదిలేక ఇటీవల ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశాం. న్యాయం జరిగేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

-రామలక్ష్మి, సభ్యురాలు, రాఘవేంద్ర గ్రూపు

సైనికుల సేవలు వెలకట్టలేనివి

కలెక్టర్ శ్యాంప్రసాద్



విద్యార్థులతో కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ప్రాణాలను లెక్కచేయకుండా సరిహద్దులో కాపలా కాస్తున్న సైనికుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ శ్యాంప్రసాద్ కొనియాడారు. కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో సోమవారం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయుధ దళాల పతాక దినోత్సవాలను ప్రారంభించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తమ వంతు విరాళాన్ని అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతిపౌరుడి కర్తవ్యమన్నారు. ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, సేవాసంస్థలు విరాళాలు అందించి, సైనికుల సంక్షేమానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కలెక్టరేట్‌లో బాల్య వివాహ ముక్త భారత్-100 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దడానికి ప్రతి అధికారి, స్వచ్ఛంద సంస్థ, గ్రామస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా అ ధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జేసీ మౌర్యభరద్వాజ్, ఆర్డీఓ సువర్ణ, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈఓ కిష్టప్ప, డీసీపీఓ మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్ పాల్గొన్నారు.

ఏమవుతుందిలే అనుకున్నారేమో..!

- ఎల్ఆర్ఎస్‌కు కొరవడిన స్పందన
- పట్టణంలో వందల అక్రమ ప్లాట్లు
- పదుల సంఖ్యలో దరఖాస్తులు
- మున్సిపల్ ఆదాయానికి భారీ గండి
- జనవరి 23తో ముగియనున్న గడువు



పట్టణంలో వేసిన అక్రమ లేఅవుట్లు

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ సిస్టమ్)కు స్పందన కొరవడింది. వందల సంఖ్యలో ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు పదుల సంఖ్యలో మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. ప్లాట్ల రెగ్యులరైజ్ చేసుకోవడానికి 2026 జనవరి 23 వరకు సమయం ఇచ్చింది. ఇందుకోసం ప్రభుత్వం అనేక రాయితీలు కూడా ప్రకటించింది. గతంలో ఉన్న 14 శాతం చార్జీలను 7శాతానికి తగ్గించింది. దీంతో పన్నులు కట్టే వాటిలో కూడా 5శాతం రాయితీని ప్రకటించింది. మొత్తం మీద సగం ధరకే ప్లాట్లు రెగ్యులరైజ్ అయ్యే అవకాశముంది. అయితే అక్రమ లేఅవుట్లు వేసిన యజమానుల నుంచి స్పందన కొరవడింది. అధికారులు మొద్దునిద్రలో ఉండటంతో ఎల్ఆర్ఎస్ ద్వారా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

స్పందించని అక్రమార్కులు

పట్టణంలో వందల సంఖ్యలో క్రమబద్ధీకరణకు నోచుకోని ప్లాట్లు ఉన్నాయి. ప్రభుత్వం 2020లో క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో 218మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనిద్వారా మున్సిపాలిటీకి రూ.1.32 కోట్ల ఆదాయం వచ్చింది. 2025లో మరోసారి ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం అనుమతించింది. 78 లేఅవుట్లలో అనుమతి లేని ప్లాట్లు ఉన్నాయి. వాటిని రెగ్యులరైజ్ చేసుకోవాలి. ఇప్పటివరకు 37 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వాటి ద్వారా రూ.23లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అక్రమ లేఅవుట్ల వల్ల మున్సిపల్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. పట్టణ పరిధిలో దాదాపు 13వందల ప్లాట్ల వరకు రెగ్యులరైజ్ కావాల్సి ఉంది. ఇవన్నీ రెగ్యులరైజ్ అయితే మున్సిపాలిటీకి రూ.5కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

మొద్దు నిద్రలో మున్సిపల్ అధికారులు

మున్సిపల్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతున్నా, అధికారులు మాత్రం మొద్దు నిద్రను వీడకుండా ఉన్నారు. ఎల్ఆర్ఎస్ గురించి ఏమాత్రం ప్రచారం చేయడం లేదు. అక్రమ లేఅవుట్లు వేసిన యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాని విషయం. అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్, ఈసీ ప్లాన్ మంజూరు చేయకూడదని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇదివరకే అధికారులను గట్టిగా హెచ్చరించారు. ఇందుకోసం ప్రత్యేకంగా రియల్టర్లు, ప్లాట్లు కొన్నవారితో సమావేశం నిర్వహించారు. కొంతమంది రియల్ ఎస్టేట్ పేరుతో మాయమాటలు చెప్పి ప్లాట్లు అమ్మేశారని అప్పుడే చెప్పారు. రెగ్యులరైజ్ చేసుకోవాలంటే లేఅవుట్ మొత్తం చేసుకోవాలని తెలిపారు. దీంతో అక్రమార్కులు తమ మోసపు వ్యాపారాలను నిలిపివేశారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతించినా, వీరు ముందుకు రాకపోవడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అందుకే ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు అక్రమ లేఅవుట్లు వేసినవారిపై వత్తిడి తెచ్చి రెగ్యులరైజేషన్ చేయించేలా ఒత్తిడి తేవాలని ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.

చర్యలు తప్పవు: కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు గడువులోపు క్రమబద్ధీకరించుకోవాలి. అలా చేయకపోతే చర్యలు తప్పవు. ఫిబ్రవరి వరకు అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడానికి అవకాశముంది. ప్రతి ఒకరు రెగ్యులరైజ్ చేసుకోవాలి. స్థల యజమానులకు అవగాహన కోసం వివిధరకాల పద్ధతుల్లో ప్రచారం చేస్తున్నాం.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మల్లంపల్లి సోమశేఖర శర్మ (జయంతి)




సుప్రసిద్ధ తెలుగు చారిత్రక పరిశోధకులు, పురాలిపి శాస్త్రజ్ఞుడు మల్లంపల్లి సోమశేఖర శర్మ 1891 డిసెంబరు 9న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం మినిమించిలిపాడు గ్రామంలో జన్మించారు. విజ్ఞాన సర్వస్వం ద్వారా వెలుగులోకి వచ్చిన సోమశేఖర శర్మ డిగ్రీలు లేని పండితుడే అయినా నేటికీ నాటికీ ఆంధ్ర చరిత్రకారుల్లో అగ్రతాంబూ లానికే అర్హత సాధించిన పరిశోధక శిఖామణి. సాహితీరంగంలో, రాజకీయ రంగంలో పేరొందారు. సేకరించిన శాసనాలను ఎపిగ్రాఫియా ఇండియా, భారతి, శారద, ఆంధ్రపత్రిక వంటి పత్రికల్లో వ్యాసాలు రాశారు. 80కుపైగా శాసనాలను లఘువ్యాఖ్యలు ప్రచురించారు. 1963లో కన్నుమూశారు.

దక్షిణామూర్తి అయ్యర్ (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు, స్వరకర్త వెంకటేశ్వరన్ దక్షిణామూర్తి అయ్యర్ 1919 డిసెంబరు 9న ట్రావెన్‌కోర్‌లో జన్మించారు. మళయాళం, తమిళం, హిందీ సినిమాలకు సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. స్వామిగా చిరపరిచితులు. 125 సినిమాలకు సుమారు 1400 పాటలకు కంపోజ్ చేశారు. పీ లీల, సుశీల, కల్యాణి మీనన్, ఇళయరాజా వంటివారికి ఆయన గురువు. సంగీతసరస్వతి అవార్డు, ఉత్తమ సంగీత దర్శకుడిగా కేరళ రాష్ట్ర ఫిల్మ్ అవార్డ్, గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2013 ఆగస్టు 2న కన్నుమూశారు.

బాబ్ హాక్ (జయంతి)




ఆస్ట్రేలియా దేశ ప్రధాన మంత్రిగా వ్యవహరించిన రాబర్ట్ జేమ్స్ లీ హాక్ 1929 డిసెంబరు 9న సౌత్ ఆస్ట్రేలియాలో జన్మించారు. లేబర్ పార్టీ అధ్యక్షుడిగా 1983 నుంచి 1991వరకు కొనసాగారు. సుదీర్ఘకాలం సేవలందించిన మూడో ప్రధానిగా పేరొందారు. రిటైర య్యాక వ్యాపారంలో రాణించడమే కాక సమాజసేవలోనూ చురుగ్గా పాల్గొనేవారు. అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా తనదైన గుర్తింపు పొందారు. 2019 మే 16న కన్నుమూశారు.

సోనియాగాంధీ (పుట్టినరోజు)



కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియాగాంధీ 1946 డిసెంబరు 9న ఇటలీలో జన్మించారు. రాజీవ్‌గాంధీని వివాహం చేసుకున్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకు గురైన కొంత కాలానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష పదవి పగ్గాలు చేపట్టారు. ఎటువంటి ప్రభుత్వ హోదాలో కొనసాగనప్పటికీ దేశంలో ప్రముఖ రాజకీయ నాయకురాలిగా పేరొందారు. గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో టైమ్స్ వెలువరించిన 2007, 2008లో టాప్ వంద ప్రభావశీలురులో ఒకరిగా, 2010లో టాప్ 50లో ఒకరిగా నిలిచారు. ఆమె పిల్లలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు రాజకీయాల్లో రాణిస్తున్నారు.

రహత్ ఫతే అలిఖాన్ (పుట్టినరోజు)



రహత్ ఫతే అలిఖాన్ 1974 డిసెంబరు 9న జన్మించారు. మేనమామ, ఖవ్వాలీ గాయకుడు నుస్రత్ ఫతే అలిఖాన్ వద్ద ఏడవ ఏటనుంచే శిక్షణ పొందారు. 15వ యేటనుంచి నుస్రత్‌తో కలసి ప్రపంచవ్యాప్తంగా పర్యటించి కచేరీలలో భాగస్వాముయ్యలయ్యారు. బాలీవుడ్‌తోపాటు పాకిస్థానీ సినీరంగంలోనూ నేపథ్య గాయకుడిగా పేరొందారు. గజల్స్ ఆలాపన ప్రత్యేకం. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

అందుబాటులోకి ఫ్యాషన్ ఆప్టికల్స్

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆరు దశా బ్దాలుగా కళ్లద్దాల రంగంలో రాణిస్తున్న జీకేబీ ఆప్టికల్స్ తన సిగ్నేచర్ ప్రదర్శనకు సిద్ధమైంది. వెడ్డింగ్ ఎడిట్ సీజన్ 5 పేరిట అందుబాటులోకి తెస్తోంది. నేటి యు వత అభిరుచులకు తగినట్టుగా అత్యాధునిక కళ్లద్దాలను అందుబాటులోకి తెచ్చినట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

11నుంచి డిజైనర్ ప్రదర్శన

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ) బెంగళూరు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 11నుంచి డిజైనర్ 5.0 ప్రదర్శన నిర్వహించనున్నారు. చిత్రకళా పరిషత్‌లో ఈనెల 14వరకు ప్రదర్శనలు కొన సాగుతాయన్నారు. డిజైన్ ఫర్ ఎవరిడే లైఫ్ అనే థీమ్‌తో ప్రదర్శన ఉంటుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆర్కిటెక్చర్స్ (ఐఐఏ) సహకారం అందిస్తుందని ప్రకటనలో తెలిపారు.

రైతు సమస్యలను పట్టించుకోండి

బీజేపీ డిమాండ్

బంగారపేట, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): అతివృష్టితో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఓబీసీ మోర్చా తాలూకా అధ్యక్షుడు చౌడప్ప నేతృత్వంలో సోమవారం తాలూకా కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చౌడప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికార వ్యామోహంలో డిన్నర్ మీటింగ్‌లతో కాలాన్ని వృథా చేస్తోందన్నారు. విజయపుర, బాగల్కోటె, యాదగిరి, బీదర్, రాయచూరు, గదగ్, కలబురగి, ధారవాడ తదితర జిల్లాల్లో అతివృష్టి కారణంగా సుమారు 95శాతం పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఉన్నపంటకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. పంటలను కోల్పోయిన రైతులకు వెంటనే ప్రకృతి వైపరీత్యాల పరిహార నిధి మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో కిసాన్ సమ్మాన్ పథకం కింద రాష్ట్రప్రభుత్వ వాటా రూ.4వేలు ఇచ్చేవారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పూర్తిగా కోత విధించారన్నారు. రాష్ట్రంలో 24లక్షలమంది పాడి రైతులు ఉన్నారని, పశుదాణా ధర పెరగడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి లీటరు పాలకు రూ.5 నుంచి 7కు ప్రోత్సాహం ఇస్తామని 2023లో హామీ ఇచ్చారని ఇంతవరకు మంజూరు చేయలేదన్నారు. 620 కోట్ల బకాయి ప్రోత్సాహకమొత్తం రైతులకు విడుదల చేయాలన్నారు. బెళగావిలో టన్ను చెరకుకు రూ.3,300 మద్దతు ధర ప్రకటించారని అయితే అన్ని జిల్లాల్లో అలా అమలు కావడంలేదన్నారు. నిరసనలో మైనారిటీ మోర్చా వాసీం అహ్మద్, సంపంగిరెడ్డి, నాగేశ్, శ్రీనివాస్, మార్కండేగౌడ తదితరులు పాల్గొన్నారు.



తాలూకా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

విద్యార్థులు ఉన్నతమైన కలలు కనాలి

ఉపలోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్ర



ఉపలోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్రను సన్మానిస్తున్న దృశ్యం

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మనుష్యులు పురాతన కాలం నుంచి భవిష్యత్తు ఆవిష్కరణల లోకం దాకా పెద్ద కలలు కనారని జీవన విధానం ఉత్తమంగా మారే ఆలోచనలు ఉండాలని, విద్యార్థులు బాల్యంనుంచే ఉన్నతమైన కలలు కనాలని ఉపలోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్ర అభిప్రాయపడ్డారు. సౌందర్య సెంట్రల్ స్కూల్ వార్షికోత్సవం సోమవారం జరిగింది. చిన్నపిల్లల వైద్యనిపుణులు సుప్రజ చంద్రశేఖర్, బ్యూటీషియన్ షాలుచావ్లా పాల్గొన్నారు. ఉపలోకాయుక్త ఫణీంద్ర మాట్లాడుతూ బాల్య జీవనం మళ్లీ రాదని, ఇక్కడ నేర్చుకున్నవి ఎప్పటికీ మరువలేమని, చదువు అనేది జీవితకాలం సాగే ప్రక్రియ అన్నారు. డాక్టర్ సుప్రజ మాట్లాడుతూ ఆరోగ్యకర ఆహార పద్ధతులు పిల్లల శారీరక, ఆలోచనలకు శక్తినిస్తాయన్నారు. సీఈఓ కీర్తనకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అకడమిక్‌యేతర కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపలోకాయుక్తను ఆత్మీయంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.

స్మార్ట్ ఇండియా హాకథాన్ గ్రాండ్ ఫినాలెకు శ్రీకారం



హాకథాన్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హాకథాన్ 2025 సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలె పోటీలు రామయ్య అప్లైడ్ సైన్సెస్ యూనివర్సిటీలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఏఐసీటీఈ సహకారంతో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ (ఎంఐసీ) ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. గ్రాండ్ ఫినాలె 36 గంటలపాటు కొనసాగుతుంది. టీమ్ ఇంటరాక్షన్స్, మెంటారింగ్ సెషన్స్, సొల్యూషన్ డెవలప్‌మెంట్ స్కిల్స్ వంటివి ఉంటాయి. కర్ణాటక నుంచే కాకుండా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, హరియాణ తదితర రాష్ట్రాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో భాగస్వామ్యులయ్యారు. వివిధ వడపోతల అనంతరం 1,360 జట్లు (8,160మంది) గ్రాండ్ ఫినాలెకు ఎంపికయ్యారు. అభివృద్ధి దాయక ఆవిష్కరణలు, సమస్యలకు పరిష్కారాలు చూపాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ఐదు జట్లకు (ఒక్కో జట్టులో ఆరుగురు) బహుమతులు లభిస్తాయి. కేంద్రప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షల నగదు రివార్డు ఇవ్వనున్నారు. ముఖ్యఅతిథిగా ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ దీపక్ శైని విచ్చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ అశోక్ రావ్, ప్రొఫెసర్ ఆర్‌వీ రంగనాథ్, డాక్టర్ నయన ఎన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై జాగృతి

శిడ్లఘట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ప్రత్యేకించి బైక్ చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలని టౌన్ ఎస్సై వేణుగోపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక జాగృతి నిర్వహించారు. హెల్మెట్ ధరించడం ద్వారా అనుకోకుండా ప్రమాదం జరిగితే పెనుప్రాణనష్టం నివారించబడుతుందన్నారు. బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాన్ని తీసే అవకాశం ఉందన్నారు. అది కుటుంబంలో విషాదం నింపుతుందన్నారు. అన్ని వాహనదారులు తప్పనిసరిగా ఆర్‌సీ, ఇన్సూరెన్స్, లైసెన్స్ తదితర రికార్డులు కలిగి ఉండాలన్నారు. పట్టుగూళ్ల మార్కెట్, కోటె సర్కిల్, బస్టాండ్ ప్రదేశాలలో జాగృతి కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై శంకరాచారి, హెడ్‌కానిస్టేబుల్ కెంపరాజు, అశ్వథ్, చీతా రాజేశ్, మురళిధర్ తదితరులు పాల్గొన్నారు.



కూడలిలో జాగృతి కల్పిస్తున్న ఎస్ఐ వేణుగోపాల్

క్రికెట్ టోర్నీకి శ్రీకారం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

ముళబాగిలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి ఆలంగూరు శ్రీనివాస్ ఆశయాలను నెరవేర్చేలా ప్రామాణికంగా పనిచేస్తానని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలిపారు. తాలూకాలోని చల్లపల్లిగేట్ వద్ద అఖిల కర్ణాటక జనసేవా ట్రస్టు, కరవే సంయుక్త ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఆలంగూరు శ్రీనివాస్ 14వ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామీణస్థాయి విల్సన్ బాల్ క్రికెట్ టోర్నీకి శ్రీకారం చుట్టారు. సమృద్ధి మంజునాథ్ మాట్లాడుతూ ఆలంగూరు శ్రీనివాస్ ఎమ్మెల్యేగా, మంత్రిగా తాలూకా సమగ్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రత్యేకించి జేడీఎస్ పార్టీ బలోపేతానికి పాటుపడ్డారన్నారు. ఆయన సమాజసేవను నేటికీ ప్రజలు స్మరిస్తారన్నారు. ఆలంగూరు శ్రీనివాస్ కుమార్తె డాక్టర్ భవాని శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాభిమానంతో బతికిన తన తండ్రిని తమ మధ్య లేకున్నా నేటికీ ప్రజలు గౌరవిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రఘుపతిరెడ్డి, సమాజసేవకుడు గొల్లహళ్ళి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

దొమ్మసంద్ర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 70వ కన్నడ రాజ్యోత్సవం పురస్కరించుకుని కర్ణాటక జాగృతిదళ అధ్యక్షుడు శివశంకర్, సంస్థాపక అధ్యక్షుడు హొసబెళకు ట్రస్టు రామకృష్ణ, సమాజసేవకుడు వికాస్‌రెడ్డి నేతృత్వంలో 62మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. దొమ్మసంద్ర హౌసింగ్‌బోర్డులోని ప్రభుత్వ స్వాతంత్ర్య పీయూ కళాశాల ఆవరణలో ఆదివారం కార్యక్రమం ఏర్పాటైంది. ఇటీవల ఆక్స్‌ఫర్డ్ ఆసుపత్రి నారాయణ నేత్రాలయ, బయోకాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. 264 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటిపొర చికిత్సలు చేసిన అనంతరం తాజాగా కళ్లద్దాలు పంపిణీ చేశారు.



కళ్లద్దాలతో లబ్ధిదారులు, నిర్వాహకులు

పరప్పన జైలులో తోటి ఖైదీలతో దర్శన్ వివాదం

బ్యారెక్ వద్ద ఉద్రిక్త పరిస్థితి

బెంగళూరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో పరప్పన అగ్రహార జైలులో గడుపుతున్న నటుడు దర్శన్ మరో వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల తోటి ఖైదీలతో దర్శన్ వివాదం చేసుకున్నట్లు తెలు స్తోంది. దీంతో దర్శన్ బ్యారెక్ వద్ద ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకోగా జైలు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పరప్పన జైలులో చోటు చేసుకుంటున్న సంఘటనలు అటు జైళ్ళ శాఖకు ఇటు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు వస్తుండటంతో కఠిన చర్యలు అమలులోకి తెచ్చారు. గతంలో దర్శన్ జైలులోనే విలాసంగా కుర్చీలలో కూర్చొని టీ తాగుతున్న ఫోటోలు వైరల్ అయిన విషయం జైళ్ళ శాఖకు తీరని సిగ్గుచేటు అనిపించేలా విమర్శలు వచ్చాయి. తాజాగా జైలులో ఉన్న ఓ ఉగ్రవాది మొబైల్ వాడకంతో పాటు కామాంధుడు ఉమేష్ బ్యారెక్‌లో మొబైల్‌లో మాట్లాడుతూ టీవీ చూసే వీడియోలు, ఫోటోలు ఏకంగా జాతీయ స్థాయిలో చర్చకు కారణ మయ్యాయి. ఢిల్లీలో కారుబాంబు పేలుడు దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ అధికారులు పరప్పన జైలుకు వచ్చి విచారణలు జరపడంతో జాతీయ స్థాయిలో జైలులో దిగజారుడు వ్యవహారాలు బహి రంగమయ్యాయి. వీడియోలు, ఫొటోలు విడుదలకు దర్శన్‌కు చెందిన ఆప్తులే కారణమనే ఆరోపణల మేరకు పోలీసులు విచారణలు సాగిస్తున్నారు. ఇదే విషయంలోనే దర్శన్‌కు తోటి ఖైదీలకు వివాదం చెలరేగినట్లు తెలుస్తోంది. రేణుకాస్వామి హత్యకేసులో అనుకుమార్, జగ్గ, నాగరాజు, ప్రద్యూష్, లక్ష్మణ్‌లు ఒకే బ్యారెక్‌లో ఉన్నారు. నాగరాజు మినహా మిగిలిన వారు దర్శన్ వేధిస్తున్నారని ఇటీవల ఆరోపించారు. కొన్ని రోజుల కిందట దర్శన్ బ్యారెక్‌లో జగ్గ, దర్శన్‌ల మధ్య పెద్ద గొడవ జరిగినట్లు తెలుస్తోంది. కాగా ఇదే జైలులో ఉంటే చనిపోతానని చిత్రదుర్గ జైలుకు మార్చు చేయాలని అనుకుమార్ జైళ్ళశాఖ అధికారులను కోరినట్లు తెలుస్తోంది. ఇలా అన్ని విషయాలలోను దర్శన్ వివాదాల పాలవుతున్నారు. జైళ్లశాఖ సిబ్బంది దర్శన్ బ్యారెక్ వద్ద ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం.

సేంద్రియ ఎరువులతోనే నేలకు రక్షణ: డాక్టర్ రమేష్

బళ్లారిరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమ దేవనహళ్లి సమీపంలో గల అగ్రి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నేల కలుషితమవుతోందని దానిని రక్షించడానికి సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులను ఉపయోగించాలని ఇది నేల సారాన్ని కాపాడుకోగలదని హగరి ఏఆర్‌ఎస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ మాట్లాడారు. బళ్లారి తాలుకాలోని హగరి ఏఆర్‌ఎస్ కృషి విజ్ఞానంలో ఆరోగ్యకరమైన నేల కోసం ఆరోగ్యమైన నగరాలు అనే నినాదంతో నిర్వహించిన ప్రపంచ నేల దినోత్సవం ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ నేల దినోత్సవాన్ని మొదటిసారిగా అంతర్జాతీయంగా డిసెంబరు 5న జరుపుకున్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో నేల సంరక్షణ గురించి అవగాహన పెంచడానికి ఒక రోజు నేల లక్షణాలు, నిధులు గురించి అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర అధిపతి డాక్టర్ బాలయ్య కార్యక్రమానికి అధ్యక్షతన వహించి పర్యావరణంలో 60 శాతం జీవుల శ్రేయస్సుకు ఒక ప్రాముఖ్యమైన పునాది అన్నారు. నేల విలువైన లక్షణాలను దృష్టిలో వుంచుకుని భూమి ఆరోగ్యాన్ని కాపాడడానికి చేతులు కలపాలి. భూమి ఒక ముఖ్యమైన వనరు ఆహార ఉత్పత్తి నీటి శుద్ధీకరణ ఉష్ణోగ్రత నియంత్రణలో ఇది కీలకపాత్ర వహిస్తుంది. డాక్టర్ రవి మాట్లాడుతూ.. ఆహార ఉత్పత్తి, స్థిరమైన భవిష్యత్తును కాపాడుకోవడానికి భూమి, భూమి ఆరోగ్యంను కాపాడుకోవ డానికి అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ పరిమితికి మించి రసాయనాలను ఉపయోగించడం వల్ల భూమి సంతానోత్పత్తి తగ్గుతుందన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయాన్ని నొక్కి చెప్పి నేల ఆరోగ్యాన్ని కాపాడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో హగరి వ్యవసాయ కళాశాల బోధన సిబ్బంది డాక్టర్ గోవిందప్ప, డాక్టర్ మంజునాథ, డాక్టర్ బసవరాజు, డాక్టర్ నాగేష్, డాక్టర్ బసప్ప, డాక్టర్ ఆనంద్, డాక్టర్ జాహ్నవి పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ రమేష్

ఉత్సాహంగా చదరంగం పోటీలు



ట్రోఫీలతో బాలికల విజేత జట్టు

బెంగళూరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో 69వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో అండర్ 19 విభాగంలో బాల, బాలికల చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. దేశవ్యాప్తంగా 32 జట్లు 300కుపైగా విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో సీబీఎస్‌ఈ జట్టు ప్రథమస్థానంలోనూ, మహారాష్ట్ర జట్టు ద్వితీయ స్థానంలోనూ, తమిళనాడు జట్టు తృతీయస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో మహారాష్ట్ర జట్టు, సీబీఎస్‌ఈ జట్టు ద్వితీయ, సీఐఎస్‌సీఈ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఇండియా 50వ, కర్ణాటక తొలి గ్రాండ్‌మాస్టర్ తేజ్ కుమార్ పాల్గొని బహుమతులను ప్రదానం చేశారు. స్కూల్ మేనేజింగ్ ట్రస్టీ నీరూ అగర్వాల్ మాట్లాడుతూ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. యువతను కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా క్రీడల్లో ప్రోత్సహించడం లక్ష్యమన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అనుకూలం కోసం ల్యాప్‌టాప్‌ను జేడీఎస్ యువనాయకుడు నవీన్‌కుమార్ సమకూర్చారు. మళమాచనహళ్ళి గ్రామానికి చెందిన మునిరాజు కుమార్తె సింధు ప్రాథమిక నుంచి ప్రభుత్వపాఠశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించింది. బాలిక ఉన్నతవిద్యకు ల్యాప్‌టాప్ అవసరమని గుర్తించి తన వ్యక్తిగత ఖర్చుతో సమకూర్చారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే రవికుమార్ స్వయంగా అందచేశారు. చక్కగా చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు గ్రామానికి మంచిపేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా జేడీఎస్ యువ ప్రముఖులు తాదూరు రఘు, మళమాచనహళ్ళి రమేశ్, ఎంజీ నవీన్‌కుమార్, గ్రామపంచాయతీ సభ్యుడు నటరాజ్, విద్యార్థిని తండ్రి మునిరాజు, సింధు సోదరుడు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

తాలూకా ఏపీఎంసీకి నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

బాగేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సహకార సంఘం (ఏపీఎంసీ)కి నూతన కార్యవర్గంకోసం ఆదివారం ఎన్నికలు జరిగాయి. వచ్చే ఐదేళ్లపాటు కొనసాగనున్నారు. డైరెక్టర్‌లుగా పద్మ, శివమ్మ, సుప్రిత్, రామకృష్ణప్పలు గెలుపొందినట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వనితా ప్రకటించారు. మొత్తం 14 డైరెక్టర్‌ల స్థానాలు ఉండగా ఏ వర్గం నుంచి సుజాత, నారాయణస్వామి, నారాయణప్ప, చంద్రశేఖరరెడ్డి, గోపాలకృష్ణ.. బీ వర్గం నుంచి ఆంజనప్ప, మరియప్ప, ఆదిమూర్తి, ఏ శ్రీనివాస్, అప్పయ్యబాబు ఏకగ్రీవమైనట్టు తెలిపారు. విజేత అభ్యర్థులను ఆత్మీయంగా సత్కరించి బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎస్ మంజునాథ్, కే నారాయణస్వామి ఎస్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీనిక్స్ మార్కెట్ సిటీలో క్రిస్మస్ ట్రీ సందడి



విద్యుద్దీపాల అలంకరణలో క్రిస్మస్ ట్రీ

మహదేవపుర, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): వైట్‌ఫీల్డ్ మెయిన్‌రోడ్డులోని ఫీనిక్స్ మార్కెట్‌సిటీలో క్రిస్మస్ సంబరాలకోసం ది మ్యాజిక్ ట్రీ హౌస్‌ను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ ట్రీ నమూనాను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. మాల్ మార్కెటింగ్ డైరెక్టర్ సౌత్ రితు మెహతా మాట్లాడుతూ ఈసారి క్రిస్మస్‌కోసం ప్రజలు సరికొత్త అనుభూతి పొందడం ఖాయమన్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1621.98	1629.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	617	3,332
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,230	5,254
నీటి నిల్వ (టీఎంసీలు)	67.05	92.42

28 నుంచి శాస్త్రీయ సమావేశం

● జిల్లా అధ్యక్షుడు చన్నబసవస్వామి



బళ్లారి సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాస్త్రీయ పరిశోధన మండలి 5వ 'రాష్ట్ర స్థాయిశాస్త్రీయ సమావేశం' ఈనెల 28 నుంచి 30వరకు యాదగిరి జిల్లాస్టేడియంలో జరగనున్నట్లు రాష్ట్ర శాస్త్రీయ పరిశోధన మండలి జిల్లా యూనిట్ అధ్యక్షుడు ఆర్.హెచ్.ఎం.చన్నబసవ స్వామి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సదస్సుకు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్ దాస్, ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్, పవాడ్ భంజాకా వ్యవస్థాపకుడు హలికల్ నగరాజ్ తదితర ప్రముఖులు హాజరవుతారని. కార్యక్రమంలో సాధకులకు విశిష్ట సేవా అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు. 11న నగరంలోని హొస్పేట్ బైపాస్ రోడ్డు సమీపంలోని జ్ఞానామృత కళాశాలలో పావడ్ భంజాక(అద్భుతాలు బద్దలు కొట్టే) బహిరంగ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. పావడ్ భంజాక వ్యవస్థాపకుడు హలికల్ నగరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. పిల్లలు స్వయంగా తయారు చేసిన పరికరాలతో ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. విలేకరుల సమావేశంలో తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూర్ పురుషోత్తమగౌడ, జ్ఞానామృత కళాశాల ప్రిన్సిపాల్ యశ్వంత్‌శెట్టి, రాష్ట్ర వైజ్ఞానిక పరిశోధన మండలి అధికారులు షానవాసపుర రాజశేఖర్‌గౌడ, నాగభూషణ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను వేధించడం తగదు

● ఆల్ ఇండియా పవర్‌మెన్ ఫెడరేషన్ ఆగ్రహం ● 13 నుంచి అఖిలభారత సదస్సు ● పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు సోమశేఖర్, ప్రమోద్, దేవదాస్

బళ్లారి సిటీ, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికులపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాన్ని బలోపేతం చేయడానికి ఏఐపీఎఫ్ డిసెంబరు 13, 14 తేదీల్లో కోల్‌కతాలో 3వ అఖిల భారత సదస్సును నిర్వహిస్తోందని ఏఐపీఎఫ్ జిల్లాయూనిట్ అఖిల భారత అధ్యక్షులు సోమశేఖర్ తెలిపారు. నగరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం ఆల్ ఇండియా పవర్‌మెన్ ఫెడరేషన్(ఏఐపీఎఫ్) పోరాడుతోందన్నారు. విద్యుత్ రంగంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానానికి తాము వ్యతిరేకమన్నారు. ఈసమావేశానికి ఐపీయూ అఖిల భారత అధ్యక్షుడు సోమశేఖర్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఐపీయూ అఖిల భారత ఉపాధ్యక్షుడు స్వపన్ ఘోష్, ప్రధాన వక్తగా ఏఐయూటీయూసీ ప్రధాన కార్యదర్శి శంకర్ దాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి సమర్ సిన్హా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రకార్యదర్శి అశోక్ దాస్, ఏఐయూటీయూసీ ఇతర రాష్ట్రాల నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ ద్వారా రాష్ట్ర పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. దీని లక్ష్యం విద్యుత్ రంగాన్ని పూర్తిగా నేరుగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం,స్మార్ట్ మీటర్లను అమలు చేయడం ద్వారా కర్ణాటక ప్రభుత్వం కూడా ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేసిందని, కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం వంటి హక్కులను నిరాకరిస్తోందన్నారు. కార్మికులకు అన్ని సంఘాలు మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఏఐయూటీయూసీ జిల్లాధ్యక్షుడు దేవదాస్, ఏఐపీఎఫ్ ప్రమోద్, సురేశ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ప్రగతి: ఎమ్మెల్యే



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే వ్యక్తి ప్రగతి సాధ్యమని, తద్వారా కుటుంబం సంక్షేమంగా వుంటుందని ఎమ్మెల్యే బీఎం నాగరాజు అన్నారు. సోమవారం సిరుగుప్ప పట్టణం 7,8 వార్డుల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రెండు తరగతి గదులను ప్రారంభించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత చెందాలని కోరారు. అన్ని రంగాల్లో ముందుకు రావాలంటే విద్యతోనే సాధ్యమని తెలిపారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గుర్రప్ప పాల్గొన్నారు.

సమస్యలపై రైతుల నిరసన



నిరసనలో రైతు సంఘాల నాయకులు

రాయచూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ అగ్ర నాయకులు ముఖ్యమంత్రి కుర్చీ కొట్లాటను మాని రైతాంగం సమస్యలు పరిష్కరించాలని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.విరుపాక్షి డిమాండ్ చేశారు. రైతులెదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జేడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన విరుపాక్షి తుంగభద్ర జలాశయంలో తగినంతా నీరు ఉన్నా రెండవ పంటకు నీరివ్వకుండా చేతులెత్తేసిన ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పట్ల పూర్తి నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నట్లు ఆరోపించారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌కేఏఆర్‌యూ, సీఐటీయూ నాయకులు

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

● నకిలీ చలానాలపై విచారణకు ప్రజాసంఘాల డిమాండ్

తోరణగల్లు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా చలాన్లు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించిన అధికారులపై తక్షణమే లోకాయుక్త విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఎఫ్ఏఆర్డీయూ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ నేతృత్వంలో సీఐటీయు, రవాణ సంస్థల ప్రతినిధుల శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ చెక్‌పోస్టుల్లో హర్యానాలోని ఒకే కంపెనీ పేరిట 194 చలాన్లు ఒకే తరహాలో జారీ కావడం ఈ సంఖ్యలోని అసాధరణ సంఖ్యే రవాణాశాఖలో జరుగుతున్న అక్రమాలపై నేరుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. హొస్పేట్‌లో 62, బాగేపల్లి 47, ములుబాగిల్ 44, అత్తిబెలె 20, చిత్రదుర్గ 14, బీజాపూర్ 4, కొప్పల్ 3, ఇలా రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ చెక్‌పోస్టుల పని విధానంపై ప్రశ్నార్థక చిహ్నం పెడుతున్నాయని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర, జాతీయ రహదారుల మీద ఇటువంటి మరెన్నో రశీదులు దొరికే అవకాశం ఉంది అని ఇది చిన్నపాటి లోపం కాదన్నారు. పద్ధతి పరమైన భారీ మోసం అని వెంటనే లోకాయుక్త విచారణ ప్రారంభించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా కమిషనర్‌ను కోరారు. చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి దిగుతామన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో విశ్వరాధ్య శివాచార్య స్వాములు

కంప్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని రామసాగర గ్రామంలో సోమవారం గణేష్ సుబ్రహ్మణ్య, అయ్యప్పస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. బుక్కసాగర, కరి సిద్దేశ్వర విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్లి ప్రభుస్వామి కల్మఠ అధ్యక్షులు రాంసాగర్, హెచ్ శివశంకర్‌గౌడ, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు, పీడీఓ మల్లికార్జున, మాజీ సభ్యులు జగదీష్‌గౌడ, అయ్యప్ప ఆలయ కమిటీ ట్రస్టు అధ్యక్షులు, నారాయణ కార్యదర్శి నారాయణ స్వామి, గౌరవాధ్యక్షులు బారకీర శివప్ప, శివయ్య, అమరేష్, ప్రకాష్, అయ్యన్న, యర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యమణి

హోసూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలు పాటించే అంశానికి సంబంధించి జాగృతి కల్పించేలా హోసూరులోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రోడ్డు భద్రతా అవగాహనపై సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యమణి కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రధాన ప్రసంగం చేశారు. ఇన్‌స్పెక్టర్ ముత్తమిళ్ సెల్వరసన్, ట్రాఫిక్ పోలీస్ ఎస్ఐ జయప్రకాశ్‌లు తమ వృత్తి జీవితంలోని అనేక అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మొబైల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. అలాగే కారు, ఇతర వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గమనించి ముందుకు సాగాలన్నారు. అంబులెన్స్ వస్తే ప్రాధాన్యత ఇస్తూ సైడ్ ఇవ్వాలన్నారు. పాదచారులకు ఇబ్బంది కలగకుండా డ్రైవింగ్ చేయాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. అజాగ్రత్తల వల్ల కలిగే ప్రమాదాలు, వాటి ప్రభావం గురించి తెలియచేశారు. కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఇన్‌చార్జి, డాక్టర్ కుమార్, కళాశాల గణాంక విభాగాధిపతి కరుణానిధి, డాక్టర్ మోహనప్రియలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల రోడ్డు భద్రతా అవగాహన కమిటీ సమన్వయకర్త డాక్టర్ సరస్వతి అతిథులను స్వాగతించారు. మేనేజ్‌మెంట్ కమిటీ సమన్వయకర్త వైరవేల్, సీఎంసీఏ సంస్థ సభ్యులు భవానీ రమేశ్, మాదప్పన్, పాల్ డేనియల్, డేవిడ్ ఇతరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ మంజునాథ్

హోసూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని కొత్తూరు ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 40 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని 21 వార్డు ప్రజలు డిమాండ్ చేశారు. 21వ వార్డు కౌన్సిలర్ మంజునాథ్ నేతృత్వంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ ఆకృతిశెట్టికి వినతిపత్రం అందించారు. అనంతరం మంజునాథ్ మాట్లాడుతూ కొత్తూరు ప్రాంతంలో 40 కుటుంబాలు 30 సంవత్సరాలకు నివసిస్తున్నారన్నారు. అయితే వారికి ఇంకా పట్టాలు మంజూరు కాలేదన్నారు. విద్యుత్, నీటి కనెక్షన్, ఇంటి పన్ను మొదలైన వాటిని క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారన్నారు. సొంత నివాసాలు లేని వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సబ్ కలెక్టర్‌కు విన్నవించామన్నారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణపై న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హోసూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో కేసులు దాఖలు చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హోసూరు లాయర్స్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు సోమవారం కోర్టు ప్రాంగణం ముందు నిరసన చేపట్టారు. నిరసనకు సంఘం మాజీ అధ్యక్షుడు న్యాయవాది ఆనందకుమార్ అధ్యక్షుడు శివశంకర్, కార్యదర్శి తిమ్మరాయప్ప నాయకత్వం వహించారు. ఫిర్యాదులు దాఖలు చేయడంలో వివిధ అవకతవకలు జాప్యం, సర్వర్ పనిచేయకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. వారం రోజులుగా కోర్టువిధులను బహిష్కరిస్తున్న న్యాయవాదులు సోమవారం కోర్టు ముందు నిరసన తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

రాయచూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరవార పట్టణ సమీపంలో గడ్డి లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌కు సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. సిరవార తాలూకాలోని అడకలగుడ్డ గ్రామానికి చెందిన రైతు మల్లప్ప పశువుల మేత కోసం ట్రాక్టర్ పై గడ్డి తీసుకెళుతుండగా పట్టణ సమీపంలోని తుగభద్ర డిస్ట్రిబ్యూటరీ 91 కాలువ వద్ద విద్యుత్ తీగలు తాకడంతో ఒక్కసారిగా ట్రాక్టర్‌కు నిప్పంటుకుంది. గడ్డి పూర్తిగా కాలిపోగా సమీపంలోని ఇరుగు-పొరుగు రైతులంతా అక్కడికొచ్చి నీళ్లను చెల్లి మంటలు ఆర్పేవేయడంతో ట్రాక్టర్ అగ్ని ప్రమాదానికి గురి కాలేదు.



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



కొట్టూరేశ్వరస్వామి

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న మఠాధీశులు

కంప్లి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన కొట్టూరులో సోమవారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. జరిగింది. పలువురు మఠాధీశ్వరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొట్టూరు వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఏటా కొట్టూరులో వైభవంగా దీపోత్సవం జరుపుకుంటామని ఆలయ పదాధికారులు తెలిపారు. స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ధార్మిక పూజలు పుష్పాలతో ప్రత్యేకాలంకరణలు చేపట్టారు. దీపోత్సవంలో క్రియామూర్తిలో శివప్రకాష్, కొట్టూరు దేవర, సోమశంకర స్వామి, జిల్లా కమిటీషనర్ కవితా మన్నికేరి, పీహెచ్ దొడ్డరామన్న, బీడీసీసీ బ్యాంకు, ద్వారకేష్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అడికే మంజునాథ, స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహిద్దాం: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే గణేశ్‌ను సత్కరిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

కంప్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బళ్లారి పట్టణంలో జనవరి 3న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే గణేశ్ పిలుపునిచ్చారు. సోమవారం కంప్లి పట్టణంలో ఎమ్మెల్యే గణేష్‌ను వాల్మీకి సంఘ నాయకులు కలిసి విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంప్లి నియోజకవర్గంలో కంప్లి, కురుగోడు తాలుకాల నుండి వాల్మీకి సమాజ పదాధికారులు, విగ్రహ ప్రతిష్ఠాపనలో అధికంగా భక్తులు పాల్గొనాలన్నారు. జిల్లాలోనే గుర్తుండిపోయేలా జరుపుకుందామన్నారు. మనస్పర్ధలకు వదిలి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సమాజంలోని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చినప్పుడే ఈ కార్యక్రమం జయవంతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హగరి గోవిందప్ప, శ్రీనాథ్, జగన్నాథ్, ముద్దమల్లయ్య, లోకేష్, బొజ్జప్ప, నరేంద్ర, ఎర్రగుడి సోమన్న, వీరేష్, రమేష్, కంప్లి వాల్మీకి సమాజ పదాధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి

తాడిపత్రి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో మెకానికల్ టెక్నీషియన్ రాంమోహన్‌రెడ్డి (55) మరణించాడు. ఇతను పట్టణ సమీపంలోని ఐశ్వర్య విల్లాస్‌లో నివాసముంటున్నాడు. రాత్రి బైక్‌పై పట్టణంలోకి వచ్చిన అతను తిరిగి ఇంటికి వెళ్తుండగా.. బస్టాండ్ వద్ద అతని బైక్‌ను ఓ లారీ వెనుక వైపు నుంచి ఢీకొంది. కిం దపడటంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాంమోహన్‌రెడ్డికి భార్య మహేశ్వరి, కుమారులు శ్రీకాంత్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గో సంరక్షక చట్ట సవరణపై బీజేపీ ఆగ్రహం



టిప్పుసుల్తాన్ గార్డెన్ వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

రాయచూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గో సంరక్షణ పరిరక్షణ చట్టాన్ని సవరిస్తు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగదళ్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరశిస్తు సోమవారం నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, గత ప్రభుత్వం గో సంరక్షణతో పాటు హిందూ సంప్రదాయ విలువలను గౌరవించేలా తీసుకొచ్చిన చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా సవరిస్తు అసలు చట్టం ఉద్దేశాన్ని నీరుగార్చే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు.

గొర్రెల మందపై దూసుకువెళ్లిన బస్సు

● పది జీవాల మృతి ● రూ.1.40 లక్షలకుపైగా నష్టం



గొర్రెల కళేబరాలను చూపుతున్న కాపర్లు

బళ్లారిరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మోకా సమీపంలో గొర్రెల మందపైకి కేఎస్ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో పది జీవాలు మృతి చెందాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం తెల్లవారుజామును బెనకల్లు క్రాస్ వద్ద కేఎస్ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో గొర్రెల మందపై దూసుకుపోయింది. పది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. లక్షకు పైగా నష్టపోయామని, పరిహారం అందించి ఆదుకోవాలని కాపర్లు కోరుతున్నారు.

'యువత అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి'

సిరుగుప్ప, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యువత అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని చైతన్య ఫౌండేషన్ అధ్యక్షులు ఖాసిమ్ వలీ అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం చైతన్య ఫౌండేషన్ అధ్యక్షులు ఖాసీమ్ వలీ మాట్లాడుతూ నేటి రోజుల్లో దేశం అభివృద్ధి చెందాలంటే యువత అన్ని రంగాల్లో దూసుకెళ్లాలని ఆయన తెలిపారు. ప్రధానంగా విద్య, క్రీడలు, రాజకీయం, ఆర్థికంగా ముందుకు వెళ్లాలని ఆయన కోరారు.

వీధికుక్కల తరలింపు



కుక్కలను బంధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బళ్లారి సిటీ,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది వీధికుక్కలను పట్టుకుని తరలించారు. ఇటీవల నివాస ప్రాంతాల్లో కుక్కలు ఉండరాదని సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇటీవల వీధి కుక్కల కాటు కేసులు పెరుగుతుండంతో ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టింది. బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లు , క్రీడా సముదాయాల నుంచి వీదికుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించారు. బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ మంజునాథ్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో వీది కుక్కలను దత్తత తీసుకుని, వాటిని సంరక్షించాలకునే వారు, దత్తత తీసుకోవాలనుకునే వారు మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

14న 'జనసిరి' సాంస్కృతిక ప్రదర్శన

బళ్లారి సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న నగరంలోని బసవ రాజేశ్వరీ పబ్లిక్ స్కూల్లో కవితా సంపుటీ అవిష్కరణ, సాధకులకు అవార్డులు, రాష్ట్రస్థాయి కవిత్వ సభ, సాంస్కృతిక నుడిసిరి సంభ్రమణం 2025నిర్వహించనున్నట్లు 'జనసిరి' ఫౌండేషన్ జిల్లాయూనిట్ అధ్యక్షుడు గిరియప్ప తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి శ్రీ జ్ఞానజ్యోతి జదేశ శివలింగ మందిరంలో బైలూరు శివశరణ మల్లప్ప తాతా , సోమసముద్ర సిద్దలింగ దేశికర్,శ్రీధర గడ్డ కొట్టూరు స్వామి సంస్థాన్ మఠం, విరక్తమఠం కొట్టూరు దేశికర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు, కార్యక్రమానికి కసాపా(కన్నడ సాహిత్య పరిషత్) జిల్లాయూనిట్ అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప అధ్యక్షత వహిస్తారు. బసవరాజేశ్వరి పబ్లిక్ స్కూల్ సంస్థ అధ్యక్షుడు మహిపాల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తిమ్మప్ప ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పలువురు సాధకులను సత్కరిస్తామ న్నారు. జనసిరి పౌండేషన్ నాయకులు తిప్పేస్వామి, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసిరి అధ్యక్షుడు గిరియప్ప